క్లుప్తంగా

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

కొత్తపల్లి: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా పిఠాపురంలోని పలు వీధుల్లో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏబీఎస్‌డీఎస్ ప్రభాకర్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అగ్రహారం, అగ్రహారం మెట్ట, కోర్టు పరిసరాలు, పశువుల సంత, హైవే పెట్రోలు బంకు సమీపం, దత్తాత్రేయ వీధి, కుమ్మరి వీధి, హార్వెస్ట్ పాఠశాల, తారకరామా నగర్, వైఎస్సార్ గార్డెన్, బీఎస్ఆర్ గార్డెన్, బొజ్జావారి తోట, మాధవపురం రోడ్డు, లయన్స్ కల్యాణ మండపం, అన్నపూర్ణ సినిమా హాలు, రెడ్డి హోటల్, మాధవనగర్, సాయిదత్త నగర్, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం, ఎల్‌బీసీ వీధి, రామా సినిమా సెంటర్ ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ అంతరాయం కలుగుతుందని తెలిపారు.

నేడు, రేపు క్యాన్సర్ వైద్య శిబిరం

సామర్లకోట: స్థానిక ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద ఉన్న పూర్ణా కల్యాణ మండపంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న క్యాన్సర్ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని గుణ్ణం చంద్రమౌళి చారిటబుల్ ట్రస్టు అధినేత చంద్రమౌళి అన్నారు. సోమవారం రాత్రి స్థానిక పూర్ణ కల్యాణ మండపంలో నియోజకవర్గ పరిధి విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. క్యాన్సర్‌పై పూర్తి స్థాయిలో అవగాహన పెంచడానికి ఈ శిబిరం దోహదపడుతుందన్నారు. హైదరాబాద్, బెంగళూరుకు చెందిన నిపుణులైన వైద్యులు రోగులను పరీక్షిస్తున్నారని, సుమారు 800 మందికి పరీక్షలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఆయన తెలిపారు. మంగళ, బుధవారాల్లో రోగులను పరీక్షించనున్నట్టు ఆయన తెలిపారు.

అలరించిన భారతీయ భాషోత్సవం



భారత భాషలపై ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

సామర్లకోట: విద్యార్థి దశ నుంచి ప్రతి ఒక్కరూ మాతృ భాషపై నైపుణ్యం పెంచుకోవడంతో పాటు భారతీయ భాషల్లో ఔన్నత్యాన్ని గుర్తించి గౌరవించడం నేర్చుకోవాలని, తద్వారా భాషా సమైక్యత, దేశ సమగ్రతకు వీలవుతుందని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత తోటకూర సాయి రామకృష్ణ అన్నారు. జాతీయ కవి సుబ్రహ్మణ్య భారతి జయంతి సందర్భంగా సోమవారం బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సుబ్రహ్మణ్య భారతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి దేశానికి, సాహిత్యానికి ఆయన చేసిన కృషి, రచనలను వివరించారు. ఈ మేరకు 22 జాతీయ భాషలను ప్రదర్శించారు. ఆయా భాషలపై నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు బి. శ్రీలక్ష్మి, పీఎస్ లక్ష్మి, జి.బేబీ రాణి, కె.శ్రీనివాసు, వి.రాజు తదితరులు పాల్గొన్నారు.


రైల్వే డాక్టర్‌గా చెన్నకేశవరెడ్డి బాధ్యతల స్వీకరణ



డాక్టర్ చెన్నకేశవరెడ్డిని అభినందిస్తున్న రైల్వే మేనేజర్ రమేష్ తదితరులు

సామర్లకోట: స్థానిక రైల్వే డాక్టర్‌గా పి.చెన్న కేశవ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కొంత కాలంగా ఈ పోస్టు ఖాళీగా ఉండడంతో కాంట్రాక్టరు పద్ధతిపై ఇప్పటి వరకు కొందరు విధులు నిర్వహించారు. అయితే పూర్తి స్థాయి వైద్యుడు కావాలని అందిన ఫిర్యాదుల మేరకు విజయవాడ రైల్వే డివిజనల్ అసిస్టెంట్ పర్సనల్ ఆఫీసర్ ఎం.అనిరుధ్ కేవశరెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. చెన్న కేవరెడ్డిని రైల్వే మేనేజరు ఎం రమేష్, రైల్వే ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు కేవీవీ రావు అభినందించారు.

షష్ఠి ఉత్సవానికి ఏర్పాట్లు ముమ్మరం



సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

పెద్దాపురం: జిల్లాలో బిక్కవోలు తరువాత మెట్ట ప్రాంతంలో ప్రసిద్ధి చెందిన మండలంలోని చదలాడ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి ఉత్సవాలకు ఆలయ కమిటీ ఏర్పాట్లను ముమ్మరం చేసింది. 14వ తేదీ నుంచి 18వ తేదీ వరకు నిర్వహించే ఉత్సవాలకు ఆలయ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేయడంలో నిమగ్నం కాగా సోమవారం చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. ఐదు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా ఆలయాన్నీ విద్యుదలంకరణతో, చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా కమిటీ అన్ని చర్యలు చేపట్టింది. షష్ఠి రోజున వేకువ జాము నుంచి ఏలేరు నదీ స్నానాలు ఆచరించి స్వామి దర్శనం, ఉత్సవాన్ని నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

మది మురిసే.. ఆధ్యాత్మికత విరిసే

- కిక్కిరిసిన కుక్కుటేశ్వరస్వామి ఆలయం
- భక్తిశ్రద్ధలతో కార్తిక సోమవారం పూజలు



పిఠాపురంలో ఉమా కుక్కుటేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకులు



కొత్తపల్లిలో రామలింగేశ్వర స్వామివారు



పిఠాపురంలో ఉమా కుక్కుటేశ్వరస్వామి ఆలయం వద్ద భక్తుల రద్దీ



నాగులపల్లిలో ఉమా రామలింగేశ్వరస్వామి



దుర్గాడలో రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక అలంకరణ

పిఠాపురం: కార్తికమాసం నాలుగో సోమవారాన్ని పురస్కరించుకుని నియోజకవర్గంలోని శైవక్షేత్రాలు భక్తులతో కిక్కిరిశాయి. స్థానిక పాదగయ పుణ్యక్షేత్రం భక్తులతో కోలాహలంగా మారింది. తెల్లవారుజామునే భక్తులు ఆలయానికి చేరుకుని పాదగయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించారు. ఉమా కుక్కుటేశ్వరస్వామి, పురుహూతిక అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలోని దత్తాత్రేయ కల్యాణ మండపంలో ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. స్వామివారికి లక్షపత్రి పూజ, అభిషేకాలు, బిల్వార్చన, అమ్మవారికి కుంకుమ పూజ చేశారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి వి.శ్రీనివాసరావు భక్తులకు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ జరిగింది. అలాగే మండలంలోని ఆలయాలు శివ నామస్మరణతో మార్మోగాయి.

కిటకిటలాడిన ఆలయాలు

కొత్తపల్లి: స్థానిక బాలాత్రిపుర సుందరి రాజశేఖర స్వామి, ఉప్పాడలోని మత్స్యలింగేశ్వరస్వామి, భ్రమరాంబ సమేత వీరమల్లేశ్వరస్వామి, గోర్స, యండపల్లి, నాగులాపల్లి తదితర గ్రామాల్లో ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయాలు భక్తులతో రద్దీగా మారాయి. కొత్తపల్లి రుక్మిణీ సమేత వేణుగోపాలస్వామి, శ్రీధర్మశాస్త్రా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కార్తిక మాసం కావడంతో మహిళలు ఆవు నెయ్యితో తయారు చేసిన దీపాలు, ధ్వజస్తంభం, రావి చెట్టు, తులసి, మామిడి చెట్ల వద్ద వెలిగించి పూజలు చేశారు. ఉప్పాడ చౌడేశ్వరి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి అన్నంతో అభిషేకం చేశారు. తొలుత వివిధ రకాల పూలతో అలంకరించారు. అనంతరం అన్న సమారాధనను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామం నుంచే కాకుండా కొత్తపల్లి, వాకతిప్ప, అమీనాబాద తదితర గ్రామాల భక్తులు తరలివచ్చారు.

సామర్లకోట: పట్టణ పరిధిలో ఆలయాల వద్ద సోమవారం అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. స్థానిక పెన్షన్‌లైన్ ఇండస్ట్రియల్ ఏరియాలోని సత్తెమ్మ తల్లి ఆలయం వద్ద ధర్మకర్త గోవిందు ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. అలాగే మఠంసెంటర్‌లో చౌడేశ్వరీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద భారీ అన్నదానం చేశారు. భక్తుడు మురపాక వీరభద్రరావు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. దీంతో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

కొత్తపల్లి: గొల్లప్రోలు మండలం దుర్గాడలో దుర్గాడలో వేంచేసి ఉన్న రామలింగేశ్వర స్వామివారిని వివిధ రకాల పూలతో విశేషంగా అలంకరించారు.

పంచాక్షరితో పంచారామం పావనం

- భారీగా తరలివచ్చిన భక్తజనం
- నేడు కోటి దీపోత్సవం

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలా త్రిపుర సుందరి సమేత కుమార రామభీమేశ్వర స్వామి ఆలయంలో భక్తులు కిటకిట లాడారు. కార్తిక సోమవారం, మాస శివరాత్రి కావడంతో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ విజయరాజు దంపతులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. పూజల అనంతరం ఆలయ పండితులు డీసీ దంపతులకు ఆశీర్వచనాలు అందజేశారు. ఈఓ టీవీ సూర్యనారాయణ స్వామి వారి ప్రసాదం, ఫొటో అందజేశారు. తెల్లవారు జామున గోపూజ, స్వామి వారి తొలి అభిషేకం, పిఠాపురం మహారాజా గోత్ర నామాలతో చేసిన తొలి పూజలను భక్తులు తిలకించారు. ఉచిత దర్శనంతో పాటు రూ.20, రూ.50, రూ.100 క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు. అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. ఆలయంలో లక్షపత్రి పూజలు, రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు జరిగాయి. ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు దీపాలను వెలిగించారు. ధ్వజస్తంభం వద్ద ఉన్న శివలింగానికి స్వయంగా అభిషేకాలు చేసుకున్నారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. కౌన్సిలర్ నేతల హరిబాబు, ట్రస్టు బోర్డు సభ్యులు, భక్త సంఘం నాయకులు, దేవస్థాన సిబ్బంది సేవలు అందించారు. అలాగే కార్తికం ముగింపును పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం కోటి దీపోత్సవం నిర్వహిస్తున్నట్టు ఆలయ వర్గాలు తెలిపాయి. జటాజూటం అలంకరణతో కార్తిక మాసోత్సవాలు ముగుస్తాయి.



పంచారామ క్షేత్రంలో స్వామివారు



పంచారామ క్షేత్రం ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు

సీఎం జగన్‌తో సుపరిపాలన

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- పి.రాయవరంలో 67 మందికి ఇళ్ల పట్టాలు



పి.రాయవరంలో అర్హులకు పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

కొత్తపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో రాష్ట్రానికి సుపరిపాలన వచ్చిందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. సోమవారం పి.రాయవరంలో పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఇక్కడి లేఅవుట్‌లో 67 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు గత పాలకులు మాయమాటలు చెప్పి ఓట్లు వేయించుకుని ఆనక అధికారం చేపట్టాక హామీలను తుంగలోకి తొక్కేవారన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి అన్ని హామీలను అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. పేదల సొంతింటి కల ముఖ్యమంత్రి జగన్‌తోనే సాధ్యమైందన్నారు. పార్టీలకు అతీతంగా అందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని అన్నారు. ముఖ్యంగా ఇళ్ల స్థలాల కోసం భూములిచ్చిన రైతులను ప్రభుత్వం ఎన్నటికీ మరువదన్నారు. ప్రభుత్వం కట్టించేవి ఇళ్లు కాదని ఊర్లేనన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ప్రజలు పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. నియోజకవర్గంలో సుమారు 23 వేల మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేయగా మొదటి విడతగా 13 వేల మందికి ఇళ్లు నిర్మించుకునేందుకు రుణాలను మంజూరు చేశామన్నారు. ఇళ్ల స్థలాలు ఇవ్వని వారికి ఈ నెల చివరిలో రోడ్లు వేయించి ఇళ్ల స్థలాలు అప్పగిస్తామని అన్నారు. ఇళ్ల స్థలాల మంజూరు నిరంతర ప్రక్రియన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మదేపల్లి బాబూరావు, బెజవాడ గోవింద్, ఎం.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

అన్నం పరబ్రహ్మ స్వరూపం

ఎమ్మెల్యే పెండెం దొరబాబు



పిఠాపురంలో అన్న ప్రసాదం వడ్డిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

కొత్తపల్లి: అన్నం పరబ్రహ్మ స్వరూపమని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. పిఠాపురంలోని ఉప్పాడ సెంటర్‌లో వినాయక ఆలయం వద్ద కార్తిక మాసం పురస్కరించుకుని వినాయక, బంగారమ్మ, సత్తెమ్మతల్లి ఆలయాల కమిటీల ఆధ్వర్యంలో సోమవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే హాజరై రూ.6 వేల విరాళం అందజేశారు. భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. కమిటీ సమకూర్చిన చీరలను మహిళలకు ఆయన పంపిణీ చేశారు. సుమారు 10 వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు బొజ్జ దొరబాబు, సచివాలయాల కన్వీనర్ బాలిపల్లి రాంబాబు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు గండేపల్లి బాబీ, కొప్పన శివనాథ్, కొత్తపల్లి వీరవెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. గొల్లప్రోలు శివాలయంలో 108 మంది పుణ్య దంపతులతో నిర్వహించిన కోటి ఒత్తుల దీపోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని పూజలు చేశారు.

ఆలయాల అభివృద్ధికి సహకరించాలి

ఆలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరి సహకారం అవసరమని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. చేబ్రోలులో వేంచేసి ఉన్న పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో జరిగిన పూజలలో ఆయన పాల్గొన్నారు. ఆలయంలో రూ.1.50 లక్షల ఎమ్మెల్యే సొంత నిధులతో పూర్తి చేసిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. జెడ్పీటీసీ సభ్యుడు ఉలవకాయల నాగలోవరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వేడుకగా వన సమారాధనలు



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సూరిబాబు

పెద్దాపురం: కార్తికం ఆఖరి సోమవారం కావడంతో పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అత్యంత భక్తి శ్రద్ధలతో శివనామ స్మరణ చేస్తూ భక్తులు దేవాలయాల వద్ద బారులు తీరారు. శివాలయాల్లో కార్తిక వన సమారాధనలు నిర్వహించారు. మండలంలోని పులిమేరు, కాండ్రకోట, దివిలి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వన సమారాధనలకు ఉలిమేశ్వరం, దివిలి, చంద్రమాంపల్లి, తాటిపర్తి, చదలాడ, మర్లావ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో డివిజన్ స్థాయిలో కార్తిక వన సమారాధన ఘనంగా నిర్వహించారు. ఆర్డీఓ జేఎస్ రామారావు ఉసిరిచెట్టు వద్ద పూజలు చేసి వన సమారాధన ప్రారంభింగా డివిజన్‌లోని 12 మండలాల రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని విశ్వేశ్వర, చంద్రశేఖరస్వామి ఆలయంలో ఈఓ కట్టుం జగన్మోహన శ్రీనివాస్, ఆలయ అర్చకులు విప్పర్తి కృష్ణతేజ వర్మల ఆధ్వర్యంలో కార్తిక మాసోత్సవాలు నిర్వహించారు.

ఎమ్మెల్యే పరామర్శ

కొత్తపల్లి: కొత్త మూలపేటకు చెందిన పొన్నాడ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ వడ్డి నూకరాజు అనారోగ్యంతో మృతి చెందారు. అతని భార్య కొత్తమూలపేట మాజీ సర్పంచ్ నాగమణిని, కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పెండెం దొరబాబు సోమవారం పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పరామర్శించిన వారిలో జెడ్పీటీసీ సభ్యుడు గుబ్బల తులసీకుమార్, మండల పార్టీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, మండల కోఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, మండల సచివాలయాల కన్వీనర్ ఉమ్మిడి జాన్, వైస్ ఎంపీపీ శెట్టిబత్తిన సురేష్‌కుమార్, బండి దావీదు, శ్రీరాంపురం సర్పంచ్ రావి రమేష్ పాల్గొన్నారు.

సంక్షేమం అందాలంటే జగనే రావాలి

- గ్రామాల్లో వై ఏపీ నీడ్స్ జగన్
- వైఎస్సార్ సీపీ జెండాల ఆవిష్కరణ



పి.తిమ్మాపురంలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు



అభివృద్ధి, సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న దవులూరి దొరబాబు



ఉప్పాడలో పథకాల బ్రోచర్ అందజేస్తున్న మండల పార్టీ అధ్యక్షుడు సుదర్శన్

పిఠాపురం: పేదలకు సంక్షేమ పథకాలు అందాలంటే రాష్ట్రానికి జగన్‌మోహన్‌రెడ్డే తిరిగి ముఖ్యమంత్రి కావాలని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. పిఠాపురం మండలం పి.తిమ్మాపురంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ ఆయన తిరిగి ప్రభుత్వ పథకాల కరపత్రాలను ప్రజలకు అందించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ఇతర రాష్ట్రాలకూ ఆదర్శంగా నిలుస్తున్నాయని ఆయన అన్నారు. గ్రామ సెంటర్‌లో పార్టీ జెండాను ఆవిష్కరించారు.

జగన్‌ను గెలిపిస్తే మరింత అభివృద్ధి

పెద్దాపురం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపిస్తే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. మండలంలోని వాలుతిమ్మాపురంలో సోమవారం వై ఏపీ నీడ్స్ జగన్ నిర్వహించారు. గృహ సారథుల మండల కన్వీనర్ గోపు మురళి అధ్యక్షతన జరిగిన సమావేశంలో దొరబాబు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు అదనంగా పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రతి ఇంటికీ సంక్షేమాన్ని అందిచేసినది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమన్నారు. రెండోసారి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రజలకు మరింత లబ్ధి చేకూరుతుందని దొరబాబు అన్నారు. అనంతరం ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు ప్రజలకు జరిగిన సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. తొలుత పార్టీ జెండా, సంక్షేమం, అభివృద్ధి బోర్డును దొరబాబు ఆవిష్కరించారు. జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, ఎంపీటీసీ రాయి వెంకటేశ్వరరావు, సర్పంచ్ కంచుమర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే బలం

కొత్తపల్లి: రాష్ట్రంలో జగనన్న చేపట్టిన సంక్షేమ పథకాలే పేదలకు కొండంత బలంగా మారాయని పిఠాపురం వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బొజ్జ దొరబాబు అన్నారు. పిఠాపురం జగ్గయ్యచెరువు కాలనీలోని 20, 21, 22 వార్డుల్లో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం జరిగింది. తొలుత ఆయా సెంటర్లలో పార్టీ జెండాలను ఆవిష్కరించారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ అవినీతికి ఆస్కారం లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో వేస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించేందుకు అంతా సహకరించాలని కోరారు. నాలుగున్నరేళ్లుగా పొందిన లబ్ధిని ప్రజలకు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు వివరించారు. గండేపల్లి రామారావు, అప్పలరాజు, బాలిపల్లి రాంబాబు, బండి రవి, కావాడి పోశయ్య, చింతడ నీలవేణి, పెంకే శ్రీలక్ష్మి, మేడిశెట్టి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అన్నివర్గాల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు అమలు చేస్తున్నారని పార్టీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్ అన్నారు. ఉప్పాడ గ్రామ సచివాలయం -4లో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయంలో అభివృద్ధి, సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. ఆయా సెంటర్లలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. మండల సచివాలయ కన్వీనర్ ఉమ్మిడి జాన్ పాల్గొన్నారు.

మూగ జీవాలకు మెరుగైన సేవలు



పశు సంరక్షణ కార్డులు అందజేస్తున్న వీర్రాఘవరావు

పెద్దాపురం: మూగ జీవాలకు సైతం రాష్ట్ర ప్రభుత్వం మెరుగైన వైద్య సేవలు అందిస్తోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కంటే వీర్రాఘవరావు అన్నారు. మండలంలోని వడ్లమూరులో సోమవారం వైఎస్సార్ పశు సంరక్షణ పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వీర్రాఘవరావు మాట్లాడుతూ పశు సంవర్ధక శాఖ ద్వారా పాడి రైతులను అన్ని విధాలా ఆదుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం పశు సంరక్షణ కార్డులను ఆయన పంపిణీ చేశారు. పశు వైద్యాధికారి కె.కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి కళ, వలంటీర్లు, రైతులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్రపై అవగాహన

సామర్లకోట: మండల పరిధిలో ఈ నెల 20 నుంచి నిర్వహించనున్న వికసిత్ భారత్ సంకల్ప యాత్రపై పంచాయతీ కార్యదర్శులకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన అవగాహన కార్యక్రమానికి ఎంపీడీఓ డి.శ్రీలలిత అధ్యక్షత వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు అట్టడుగున ఉన్న వర్గాలకు తెలియజేయడానికి పంచాయతీ కార్యదర్శులు తీసుకోవలసిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈఓ పీఆర్డీ కర్రి హరికృష్ణ సత్యారెడ్డి శిక్షణ నిర్వహించారు. మంగళవారం వరకు అవగాహన కార్యక్రమం ఉంటుందని ఈఓ పీఆర్డీ తెలిపారు.

చరిత్రను మలుపుతిప్పిన జగన్ పాదయాత్ర

- ప్రజల గుండెల్లో ఆయన స్థానం సుస్థిరం
- రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ దవులూరి



తిరుపతికి పాదయాత్రగా వెళ్తున్న దొరబాబు

పెద్దాపురం: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధించాలని, జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని ఆకాంక్షిస్తూ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ దవులూరి దొరబాబు వరుసగా ఆరోరోజు సోమవారం తిరుపతి శృంగార వల్లభ స్వామి ఆలయానికి పాదయాత్ర చేశారు. దేశ రాజకీయాల్లో ప్రతిపక్ష నేతగా నాడు జగన్ చేపట్టిన పాదయాత్ర రాష్ట్ర చరిత్రను మలుపుతిప్పిందని, ప్రజా సంక్షేమ సాధకునిగా ఆయన ప్రజల గుండెల్లో స్థానం సుస్థిరం చేసుకున్నారని దవులూరి అన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, సామర్లకోట వైస్ చైర్మన్ ఊబా జాన్ మోజెస్, గృహ సారథుల మండల కన్వీనర్ గోపు మురళి, వ్యవసాయ సలహా మండలి సభ్యులు యినకొండ వీర విష్ణుచక్రం తదితరులతో పాదయాత్రను చేపట్టారు. ఆలయ ఈఓ పులి నారాయణమూర్తి, ఆలయ చైర్మన్ కర్రి జగదీష్, ఎంపీటీసీ కుంచే బుచ్చిరాజు, అమరావతిలు ఆయనకు ఘన స్వాగతం పలికారు.

సమస్యల పరిష్కారానికే 'స్పందన'

- ఆర్డీఓ సీతారామారావు
- ప్రజల నుంచి 16 అర్జీల స్వీకరణ



స్పందనలో అర్జీ స్వీకరిస్తున్న అధికారులు

పెద్దాపురం: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతి వారం స్పందన నిర్వహిస్తున్నట్టు ఆర్డీఓ జె.సీతారామారావు అన్నారు. డివిజన్‌లో ఆయా మండలాల నుంచి సోమవారం 16 అర్జీలు అందినట్లు ఆర్డీఓ తెలిపారు. ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ స్పందనలో వచ్చే ప్రతి అర్జీ సత్వర పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. ప్రతి అర్జీని సంబంధిత అధికారులు పరిష్కరించాలని సూచించారు. డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖకు బదిలీ చేసి సమస్యను పరిష్కంచరిందేకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. పట్టణ పరిధిలో పరిశ్రమల వల్ల వచ్చే కాలుష్య నివారణ చేపట్టాలని, భూమి రీ సర్వే చేయాలని, ఆక్రమణకు గురైన స్థలాలను కాపాడాలని, పట్టాదారు పాస్‌బుక్‌లో పేర్లు మారాయని, తదితర సమస్యలపై ఫిర్యాదులు అందాయన్నారు. డీఎల్‌పీఓ బాలామణి, మున్సిపల్ మేనేజర్ యూ.జ్యోతిరాణి, ఆర్డీఓ కార్యాలయ డీటీ భానుకుమార్ తదితరులున్నారు.